క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని ఆటో డ్రైవర్లందరు ట్రాఫిక్ నిబంధనలను పాటించి ప్రమాదాలను అరికట్టాలని కడప ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జావీద్ సూచించారు. సోమవారం కడపలోని సంధ్యా సర్కిల్‌నందు రాయల్ రసీద్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటోలకు ట్రాఫిక్ నిబంధనలకు సంబంధించిన స్టిక్కర్లను ఆవిష్కరించి ఆటోలకు అతికించారు. ఈ కార్యక్రమంలో హోమియోపతి డాక్టర్ శ్రీనివాసులు, ఆర్‌ఆర్ సంస్థ అధ్యక్షులు రాయల్ కరీముల్లా తదతరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

కడప ఎడ్యుకేషన్: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి సుబ్రమణ్యం సూచించారు. సోమవారం కడపలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి తమలపాకు, వైల్డ్ ఆనియన్, బంతి, మోదుగ తదితర మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

మున్సిపల్ అదనపు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో పనిచేస్తున్న అదనపు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కోరారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట వారు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నగర నాయకుడు ప్రకాష్ మాట్లాడుతూ 2021 సంవత్సరం కోవిడ్ సమయంలో అవసరాన్ని బట్టి అదనపు కార్మికులను పనికి తీసుకున్నారని.. అప్పటినుంచి ఇప్పటివరకు వారు కేవలం 12,000 రూపాయలకే పని చేస్తున్నారన్నారు. కమలాపురం నుంచి దాదాపు 100 మంది కార్మికులను మలేరియా విభాగంలో విధులు నిర్వహించడానికి ప్రత్యేకంగా పిలిపించుకొని వారితో అతి లోతైన డ్రైనేజీ కాల్వలు, వంకలు, ఫాగింగ్ వంటి పనులు చేయిస్తూ కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కమలాపురం నుంచి రాను, పోను చార్జీలకే ఎక్కువ పోతోందని, వారికి రూ.18 వేల వేతనం, వెహికల్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు ఎస్. రవి, జిల్లా ఉపాధ్యక్షులు కె. తిరుపాల్, కె.శ్రీరాములు, పెద్ద ఎత్తున అడిషనల్ కార్మికులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



అధికారులకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఆర్‌ఎంపీఐ, ఎంసీపీఐయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆర్‌ఎంపిఐ, ఎంసిపిఐయూ నాయకులు కోరారు. ఈ విషయమై సోమవారం కడప కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వారు అధికారులకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్ ఎంపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల రమణయ్య, ఎంసిపిఐయూ జిల్లా నాయకులు సిపి నాగేంద్ర కుమార్‌లు మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదవారి కోసం జగనన్న కాలనీలో ఇంటి స్థలాలు ఇచ్చి గృహాలను నిర్మించిందన్నారు. కానీ సంబంధిత కాలనీలలో మౌలిక సదుపాయాలైన తాగునీరు, విద్యుత్, రోడ్లను నిర్మించాలన్నారు. కనీసం తాగేందుకు మంచినీళ్లు కూడా లేక అక్కడ ఉన్న ప్రజలు ట్యాంకర్లు పెట్టి బయట నుంచి నీళ్లు తెప్పించుకుంటూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఇక్కడ మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంపిఐ, ఎంసిపిఐయూ నాయకులు పాల్గొన్నారు.

ఇంటిలో చోరీ

కడప అర్బన్: కడప నగరంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బ్రాహ్మణ వీధిలో పద్మజ అనే రిటైర్డ్ ఉద్యోగిని ఇంటిలో చోరీ జరిగింది. బాధితురాలు తాళం వేసి ఊరికి వెళ్లింది. తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి 7 తులాల బంగారు ఆభరణాలను దొంగిలించినట్లు గుర్తించింది. ఈ మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సంతకాల సేకరణ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ ఆగస్టు 5న చలో విద్యుత్ భవన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు మనోహర్, మద్దిలేటి, సుబ్బరాయుడు, రమణయ్య పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఐటీఐ సర్కిల్ లో స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, పెంచిన ఇంధన సర్దుబాటు చార్జీలు ఉపసంహరించుకోవాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు దస్తగిరి రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రామ్మోహన్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

నాగన్నా...కాపాడవయ్యా ..



కడప నగరంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు

కడప సెవెన్‌రోడ్స్ : శ్రావణ మాసం చవితి సందర్భంగా సోమవారం కడప నగరంలో భక్తులు నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మృత్యుంజయకుంట శివాలయ ప్రాంగణం, తహసీల్దార్ కార్యాలయం వెనుక గల నాగులకట్ట, శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలోని నాగుల దేవతల విగ్రహాల వద్ద, మహావీర్ సర్కిల్, నగర పాలక సంస్థ కార్యాలయంతోపాటు ఇంకా పలు దేవాలయాలలోని నాగుల విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరికొందరు సమీపంలోని పుట్టల వద్ద కూడా పూజలు చేశారు. పుట్టలకు పసుపు కుంకుమలు, తోరాలు (పసుపు పూసిన పచ్చిదారాలు) అలంకరించి పాలుపోసి చలివిడి ముద్దలు, నూగుల ముద్దలు ప్రసాదంగా ఉంచారు. కుటుంబాలు చల్లగా ఉండాలంటే నాగ దేవతల అనుగ్రహం ఉండాలని కోరుకున్నారు.

కమలాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళలు నాగుల చవితి పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. సోమవారం నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కమలాపురం, కె.అప్పాయపల్లె, గంగవరం, సంబటూరు, పెద్దచెప్పలి, పందిళ్లపల్లె, ఎర్రగుడిపాడు, కోగటం తదితర గ్రామాలలో వెలసిన ఉన్న పుట్టల వద్దకు నాగుల చీరలు ధరించిన మహిళలు వెళ్లి పుట్ట చుట్టూ దారం చుట్టి, పసుపు రాసి, పుట్టలో పాలు పోసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపవాసం పాటించారు. అనంతరం సలిబిండి, నూగులు పిండి పంచి పెట్టారు. మహిళలందరూ గ్రామాల శివార్లలో ఉన్న పుట్టల వద్దకు పెద్ద సంఖ్యలో మహిళలు వెళ్లి పూజలు చేశారు.

బాలలకు చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ మహేష్

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో కడప చిన్నచౌక్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు హ్యూమన్ ట్రాఫికింగ్, బాలల చట్టాలపైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ జి.మహేష్ మాట్లాడుతూ పిల్లలు సమాజం పట్ల, సమాజంలో జరుగుతున్న విషయాలపైన అవగాహన కలిగి ఉండాలన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి , జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ విజయ కుమారి, ఫిజిక్స్ అధ్యాపకురాలు విజయలక్ష్మి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళలకు స్వయం ఉపాధి కల్పనే ధ్యేయం



కుట్టు శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న నాబార్డు జీఎం విజయ విహారి, సీఐ ఓబులేశు

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా ఉన్నతి సాధించాలనేది తమ ధ్యేయమని నాబార్డు జీఎం బి.విజయ విహారి తెలిపారు. సోమవారం ఐటీఐ సర్కిల్‌లోని యూత్ హాస్టల్‌లో వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. సీఐ ఓబులేసు మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి మార్గంలో ముందుకు సాగేందుకు ఈ శిక్షణ ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. వికసిత ఫౌండేషన్ చైర్మన్ శూలం లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఎన్నికలు ఏకగ్రీవం

కడప రూరల్ : ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ కమలాపురం తాలూకా యూనిట్ ఎన్నికలను సోమవారం స్థానిక ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఎన్నికల అధికారిగా నరేంద్ర వ్యవహరించారు. ఈ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షులుగా కె.వెంకట రత్నం, సహ అధ్యక్షులుగా రెడ్డి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వర్లు, బి.కొండారెడ్డి, సి.వసంత, కె.పవన్ కుమార్, కార్యదర్శిగా వి.వెంకట సుబ్బయ్య, జాయింట్ సెక్రటరీలుగా సాదిక్ షరీఫ్, నాగమునిరెడ్డి, మునికృష్ణయ్య, రెడ్డితులసి, కోశాధికారిగా కె.లక్ష్మమయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వై.ప్రసాద్‌యాదవ్, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్ తదితరులు నూతనంగా ఎన్నికైన సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

స్వీపర్లకు పెండింగ్‌లో ఉన్న జీతాలు విడుదల చేయాలి

– మేయర్, కమిషనర్లకు వినతి



మేయర్ సురేష్ బాబుకు వినతి పత్రం సమర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకుడు బాదుల్లా

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ పరిధిలో ఉండే ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు పెండింగ్‌లో ఉన్న 3 నెలలు వేతనాలు తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, నగర అధ్యక్షుడు పి. సుబ్బరాయుడు కోరారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ సురేష్ బాబు, అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రలకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వీపర్లకు గత మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బడుల్లోనే బండెడు చాకిరీ చేసినా వేతనాలు సక్రమంగా అందకపోవడంతో అప్పు చేసి కుటుంబాలు పోషించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు తగ్గట్టుగా శానిటేషన్ కార్మికులు లేకపోవడంతో రాగి జావా, కోడి గుడ్లు ఉడకబెట్టడం, మధ్యాహ్నం భోజనం వడ్డించడం లాంటి ఇతర పనులతో విపరీతమైన పనిభారం పెరిగిందన్నారు. వర్కర్లు అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని, వారికి పనికి తగిన వేతనం ఇవ్వాలన్నారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రమాద బీమా, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, సంవత్సరానికి రెండు జతల యూనిఫారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వీపర్ల యూనియన్ నాయకురాలు నాగరత్నమ్మ, జకీయా, జరినా, షాహినా, అక్బరున్నిషా పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



విలేకర్లతో మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకట గోపి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్తు (ఏబీవీపీ) రాష్ట్ర కార్యదర్శి వెంకట గోపి డిమాండ్ చేశారు. సోమవారం కడపలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఏబీవీపీ కడపశాఖ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఏబీవీపీ నాయకులతో కలిసి మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఉన్నత విద్య విద్యార్థులకు గుదిబండగా మారిందని అన్నారు. ఇంటర్మీడియట్ పూర్తయి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో డిగ్రీ అడ్మిషన్లు జరగలేదన్నారు. దీంతోపాటు ఇంజనీరింగ్ అడ్మిషన్లు కూడా పూర్తి కాలేదని, అందువల్లనే విద్యార్థులంతా వేరే రాష్ట్రాలకు వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం మొత్తం అన్ని జిల్లాలు పర్యటిస్తూ ప్రతి జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను సందర్శించామని ఎక్కడ కూడా సరైన వసతులు లేవని మండిపడ్డారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో మెడికల్ విద్య సామాన్య విద్యార్థులకు అందని ద్రాక్షగా మారిందని అన్నారు. కడప నగరంలోని వైయస్సార్ ఆర్కిటెక్చర్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం కూడా ఎటువంటి సిఓఎస్ గుర్తింపు లేకుండా నడిపి విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వాలు చెలగాటమాడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవన్ కుమార్, నగర కార్యదర్శి కిషోర్, రోహిత్, యశ్వంత్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం చెల్లించాలి



కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్: కడప నగరం విశ్వనాథపురం వద్ద జరుగుతున్న రైల్వే అండర్ బ్రిడ్జి వల్ల ఇళ్లు కోల్పోతున్న బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలని డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి కోరారు. సోమవారం కమిషనర్ మనోజ్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఆగిపోయాయని, సంవత్సర కాలంగా ఈ ప్రదేశంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నదన్నారు. రైల్వే బ్రిడ్జి అవతల అంగడివీధి, విశ్వనాథపురం, తెలుగుగంగ కాలనీ, మామిళ్ల పల్లె తదితర ప్రాంతాలకు చెందిన 20 వేల మంది జనాభా రాకపోకలు సాగించడానికి ఇదొక్కటే మార్గమన్నారు. బ్రిడ్జి నిర్మాణ సమయంలో ఒక చిన్న రోడ్డు మాత్రమే ఏర్పాటు చేయడంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలు తిరిగేందుకు చాలా కష్టంగా ఉందన్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులను కూడా త్వరగా పూర్తి చేసి ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు షఫీ, శివకోటిరెడ్డి, అజ్మతుల్లా, డివిజన్ ఇన్‌చార్జులు శ్రీరంజన్‌రెడ్డి, సుబ్బరాయు డు, బసవరాజు, రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలి



ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డును పంపుతున్న భవన నిర్మాణ కార్మికులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునః ప్రారంభించాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ సెక్రెటరీ ఉద్దె మద్దిలేటి, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగన్న డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కడప నగరంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు భవన నిర్మాణ కార్మిక సమస్యలను పరిష్కరించాలని పోస్ట్ కార్డ్‌లను పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునః ప్రారంభిస్తామని మేనిఫెస్టోలో పెట్టారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నప్పటికీ సంక్షేమ బోర్డు అమలు చేయకపోవడం అత్యంత బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు మల్లికార్జున, ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం కడప నగర నాయకులు నరసింహులు, బాషా, బుజ్జి, మస్తాన్, బ్రహ్మయ్య, మహేష్ ,నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు, మధ్యాహ్న భోజన కార్మికులు

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, నైట్ వాచ్‌మెన్‌లకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, మధ్యాహ్న భోజన పథక వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు చాంద్‌బాషా, కార్యదర్శి సులోచనమ్మ మాట్లాడారు. 2003 నుంచి పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. వాచ్‌మెన్లకు ఐదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఇంటి అద్దెలు, విద్యుత్ బిల్లుల చెల్లింపు, పాలు, ఆస్పత్రి ఖర్చులకు చాలా ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించడంతోపాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించి గ్యాస్ ఉచితంగా సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు సుబ్బరాయుడు, అనిల్, మధ్యాహ్న భోజన పథకం యూనియన్ నాయకులు శంకరయ్య, లక్ష్మి పార్వతమ్మ, శారదమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం

కడప అర్బన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్.పి. ఈ.జి. అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ఆయన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో అదనపు ఎస్పీ మాట్లాడి వారి ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డి.టి.సి. డీఎస్పీ అబ్దుల్ కరీం, మహిళా పి.ఎస్ డీఎస్పీ బాలస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధినేతల మెప్పు కోసం బీటెక్ రవి, రాంగోపాల్ ఆరాటం

– వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిషోర్ బూసిపాటి



మాట్లాడుతున్న కిశోర్ బూసిపాటి

కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌ల మెప్పు కోసం పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి లు ఆరాటపడుతున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిశోర్ బూసిపాటి విమర్శించారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మెప్పు కోసం బీటెక్ రవి, లోకేష్ మెప్పు కోసం రాంగోపాల్‌రెడ్డి పోటీలు పడుతూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రజలకు కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సతీష్ రెడ్డి నిత్యం వివిధ వేదికలపై నిలదీస్తున్నారన్నారు. అయితే సతీష్ రెడ్డి ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం లేని కూటమి పార్టీ నాయకులు.. ఆయనపై స్థాయికి మించి విమర్శలు చేస్తూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కొన్ని రోజులుగా నారా లోకేష్ ఆదేశాల మేరకు పులివెందుల ప్రాంతానికి చెందిన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, పులివెందుల టిడిపి ఇన్చార్జి బీటెక్ రవిలు సతీష్‌రెడ్డిపై లేనిపోని విమర్శలు చేస్తూ బురద జల్లుతున్నారన్నారు. పులివెందుల మెడికల్ కళాశాలకు వచ్చిన 50 మెడికల్ సీట్లను కూటమి ప్రభుత్వం వెనక్కి పంపితే వారిద్దరూ ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించలేదన్నారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ వైద్య విభాగం జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ డా. పెంచలయ్య పాల్గొన్నారు.

మంత్రులు పేదలను దత్తత తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా

కడప ఎడ్యుకేషన్: మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు ఉన్నతాధికారులు ముందుగా పేద కుటుంబాలను దత్తత తీసుకుని ఆదర్శంగా నిలవాలని, ఆ తర్వాత మాత్రమే కిందిస్థాయి ఉద్యోగులను అడగాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబులు అన్నారు. కాని ఇప్పటి వరకు ఏ ఒక్కరూ ఏ ఒక్క కుటుంబాన్ని కూడా దత్తత తీసుకున్న దాఖలాలు కనబడడం లేదని, కాని ఉద్యోగులు, ఉపాధ్యాయులను పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలని ప్రభుత్వం నిర్బంధించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. సోమవారం సాయంత్రం కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. జీరో పావర్టీ (పి-4) కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థి కుటుంబాలను తప్పనిసరిగా దత్తత తీసుకోవాలంటూ విద్యాశాఖ అధికారులు నిర్బంధం చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన పేరుతో ముఖ్యమంత్రి ప్రారంభించిన ఈ పి-4 కార్యక్రమంలో సంపన్నులు ముందుకు వచ్చి పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలన్నారు. కానీ ముఖ్యమంత్రి చేపట్టిన కార్యక్రమానికి స్పందన రాకపోవడంతో ఆ భారాన్ని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులపై నెడుతున్నారని వారు పేర్కొన్నారు. పి-4 విధానంలో భాగంగా ప్రతి ప్రధానోపాధ్యాయుడు కనీసం 5 కుటుంబాలను, ఉపాధ్యాయులు 2 కుటుంబాలను తప్పనిసరిగా దత్తత తీసుకుని ఆన్లైన్ లో రిజిష్టర్ చేయాలని విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులకు లింకులు పంపి రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని పదే పదే ఒత్తిడి చేయడం చేయడం సరికాదన్నారు.

తీరిన ట్రాఫిక్ సమస్య

కడప రూరల్ : స్థానిక పాలెంపాపయ్యవీధిలో ట్రాఫిక్ సమస్యగా ఉందని స్థానికులు జిల్లా కలెక్టర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన ట్రాఫిక్ పోలీసులు, కార్పొరేషన్ అధికారులు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంతో స్థానికులు బాబు సాహెబ్, సలాం, అమర్, ఖాదర్‌బాష, రమణయ్య, నాగభూషణ్‌రెడ్డి తదితరులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా సైన్సు సెంటర్‌ను అందుబాటులోకి తేవాలి

కడప ఎడ్యుకేషన్: కడప కేంద్రంగా ఉన్న జిల్లా సైన్సు సెంటర్‌కు సంబంధించిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన కడప చెన్నూరు బస్టాండ్ వద్ద ఉన్న జిల్లా సైన్సు సెంటర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను క్యూరేటర్ రెహమాన్‌తో కలిసి పరిశీలించారు. ఇంకా పూర్తికాని పనుల పట్ల ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ డీసీఈబీ సెక్రటరీ శంకరయ్య ఉన్నారు.

పట్టుదలతోనే విజయం



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్: కఠోర శ్రమతోపాటు అలుపెరుగని పట్టుదలే విజయ రహస్యమని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ జి రవీంద్రనాథ్ అన్నారు. కడపలోని ప్రభుత్వ పురుషుల కళాశాల నుంచి జూలై 15 నుంచి 25 వరకు సికింద్రాబాద్ లో నిర్వహించిన ఆర్మీ అటాచ్మెంట్ క్యాంపునకు ఎన్.సి.సి క్యాడెట్లు హాజరై అక్కడ నిర్వహించిన వాలీబాల్, కల్చరల్, డ్రిల్, టగ్ ఆఫ్ వార్ వంటి విభాగాలలో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. సోమవారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ ప్రతిభ చూపిన వారిని అభినందించారు. కళాశాల ఎన్.సి.సి అధికారి కెప్టెన్ డాక్టర్ నీలయ్య, ఎన్.సి.సి అధికారి లెఫ్టినెంట్ మహేష్ , వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి రమేష్, అధ్యాపకులు డాక్టర్ సుధాకర్ రెడ్డి, డాక్టర్ పి రవి శేఖర్, సావిత్రి, శివరాం మరియు క్యాడెట్లు పాల్గొన్నారు.

బ్యాలెట్ పేపర్‌తోనే ఎన్నికలు నిర్వహించాలి



ప్రదర్శనలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : ఈవీఎంలతో కాకుండా బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించాలని రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కమిటీ జాతీయ అధ్యక్షులు సంగటి మనోహర్ కోరారు. ఈవీఎం వ్యతిరేక జాతీయ ఉద్యమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహించారు. ఎన్నికలు పారదర్శకంగా జరగాలంటే బ్యాలెట్ పేపరే ఉండాలన్నారు. ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించడం ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరచడమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాజన రాజ్యం పార్టీ జాతీయ సమన్వయకర్త షేక్ అమీన్‌పీరా, షేక్ హుమేరా, సావంత్ చంద్రకళా భాయి, ఎస్సీ ఎస్టీ మానవ హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షులు జేవీ రమణ, ఏపీ దళిత మిత్ర సంఘం అధ్యక్షులు కై పు రామాంజనేయులు, సాంబ శివయ్య, లోక్‌సత్తా నాయకులు దేవర శ్రీకృష్ణ, బీసీ యునైటెడ్ జాతీయ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు డీఎం ఓబులేశు యాదవ్, సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గుర్రప్ప, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకులు మడగలం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.